క్లుప్తంగా

మైలవరంలో నేడు ఉచిత వైద్యశిబిరం

మైలవరం: స్థానిక తారకరామానగర్‌లో విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గుడ్ హోప్ గాస్పెల్ మినిస్ట్రీస్ పాస్టర్ టి.జయపాల్ సహకారంతో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక స్వర పాలీక్లినిక్ కోఆర్డినేటర్ చాట్ల వీరాస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్లు సీహెచ్ రత్నకాంత్, సీహెచ్ ఆదిత్య, గౌతమి.. ఉచితంగా వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తారని పేర్కొన్నారు.

24న లక్ష్మీగణపతి ఆలయంలో శాంతి కల్యాణం

మైలవరం: నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో శ్రీలక్ష్మీ గణపతి నవరాత్రులు పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు శాంతి కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి రోజూ రాత్రి 7.45 గంటలకు నక్షత్ర హారతి జరుగుతుందని పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నంలో నేడు జగనన్నకు చెబుదాం

ఇబ్రహీంపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఈ నెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని స్థానిక అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: ముసునూరు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియపర్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో గానామృతం

గంపలగూడెం: వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా గురువారం పలుప్రాంతాల్లో నాలుగోరోజు వేడుకలను ఘనంగా జరిపారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గంపలగూడెం గాంధీసెంటర్ వద్ద శిబిరంలో మహిళలు శ్రీసంపత్ గణపతి కళ్యాణ గానామృతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వినతిపత్రం అందజేత

గంపలగూడెం: గుర్తించని తెగులు, వైరస్ కారణంగా నష్టపోయిన మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి సాయిశ్రీకి బాధిత రైతులు గురువారం వినతిపత్రం అందజేశారు. పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని వినియోగించుకోండి



ఇబ్రహీంపట్నం: దాతల సాయాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ పాలడుగు జోత్స్న తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు ఇర్ఫాన్ మేనమామ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను, స్థానిక పాస్టర్ బ్యాగులను విరాళంగా అందజేశారు. వాటిని ఎంపీపీ పాలడుగు జోత్స్న పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారికి విద్య అనే ఆయుధాన్ని అందిస్తే ప్రపంచాన్ని జయిస్తారని తెలిపారు. అనంతరం ఎంపీపీని సన్మానించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఇబ్రహీంపట్నం: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు యంత్రతి కోటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలో బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నందిగామ నియోజకవర్గ కన్వీనర్ బంకా రాజు మాదిగ, కటారపు మనోహర్ మాదిగ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు ఘంటసాల

విజయవాడ కల్చరల్: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని సీనియర్ గాయకుడు రామనాథం అన్నారు. అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండంలోని నిర్వహిస్తున్న గణపతి నవరాత్రుల్లో గురువారం ఘంటసాల గాన వైభవం అంశంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల గానం చేసిన భక్తి గీతాలు తరాలు మారుతున్నా వాటి వైభవం మారలేదన్నారు. ఆయన స్వరపరచి గానం చేసిన పలు భక్తి గీతాలను ఆలపించారు. అమరావతి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, సంస్థ అధ్యక్షుడు ఊటుకూరు పార్థసారథి కోశాధికారి అనుముల సోమశేఖర్ పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి



కోకిలంపాడులో గర్భిణులకు సామూహిక సీమంతం



పోషక మాసోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

నూజివీడు: సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల పోషకాహార ప్రదర్శనను తిలకించి అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం, దేశం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నా బాలికలపై వేధింపులు, అఘాయిత్యాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలల హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రేపటి పౌరుల్ని క్రియాశీలురుగా మార్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో అనేక విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని, ప్రపంచ స్థాయి ప్రమాణాలకనుగుణంగా విద్యార్థులకు విద్యనందిస్తోందన్నారు. విద్యతో పేదకుటుంబాల్లో మార్పు వస్తుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో వీజే విజయ్‌కుమార్, ఎంఈవో-1 ఎం.సేవియా మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడంతో మాతా శిశుమరణాలను నివారించవచ్చన్నారు.

కిశోర బాలికలకు ముందుగా పోషకాహారంపై అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఎస్వే నూరాణి, కోనేరుపేట వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కొలుసు సౌమ్య, ఏసీడీపీవో నాగేశ్వరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

కోకిలంపాడు(తిరువూరు): స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోకిలంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఆకుకూరలు, పండ్లు, పాలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకున్న గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వచ్చని తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి సూచించారు. సర్పంచి మాధవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రూసీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.

పరిసరాల శుభ్రతతో దోమల ఉధృతిని అరికట్టాలి



ముక్కొల్లుపాడులో సూచనలు చేస్తున్న డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఆశ

నూజివీడు: పరిసరాలను శుభ్రంగా ఉంటే దోమల ఉధృతిని అడ్డుకోగలమని నూజివీడు డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దయాల ఆశ అన్నారు. మండలంలోని ముక్కొల్లుపాడులో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను, వైద్య శిబిరాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ మాట్లాడుతూ దోమకాటుతో జ్వరాలు ఉధృతమవుతున్నాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడటం, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. అప్పుడే దోమల బెడదను పూర్తిగా తగ్గించవచ్చన్నారు. తప్పనిసరిగా దోమ తెరలను వాడాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు దోమలు కుట్టడం వల్లనే వ్యాపిస్తాయన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే ఏఎన్ఎం దృష్టికి తీసుకెళ్లి వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు అభినందన



తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల క్రీడాకారిణులు

తిరువూరు: గంపలగూడెంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థినులు వివిధ క్రీడల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎస్ రాజు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, యోగా, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌లతో పాటు జావలిన్, డిస్కస్ త్రో, రన్నింగ్, హైజంప్, షాట్‌పుట్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను గురువారం పాఠశాలలో అభినందించారు.విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయిని సుకన్యను ఉపాధ్యాయులు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కోటపాడులో ప్రజలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

చాట్రాయి: కోటపాడు, చిత్తపూరు, చనుబండ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ పరిశీలించారు. చనుబండ హైస్కూల్లోని 3వ బూత్ ఉన్న గది శిథిలావస్థలో ఉండడంతో మరో గదిలోకి మార్చాలంటూ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లపై బీఎల్వోలు యుద్ధప్రాతికన చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆదేశించారు. మండలంలోని గోపవరంలో వ్యవసాయ సొసైటీ నుంచి ఎంపీ ప్రాథమిక పాఠశాలకు మార్చనున్న 98 వ నంబరు పోలింగ్ బూత్‌ను గురువారం ఆయన పరిశీలించారు. మండలంలో తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటర్ల సవరణ, ఆధార్‌లింక్ తదితర ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం ముసునూరు హైస్కూల్లో శుక్రవారం జరుగనున్న మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, ఎంపీడీఓ జి.రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, కార్యాలయ పర్యవేక్షకుడు సాయిరాము, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జి.కొండూరు విద్యార్థి



విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు

జి.కొండూరు: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జి.కొండూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రత్నకుమార్ ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీలత గురువారం ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు జిల్లా జట్టులో రత్నకుమార్ ఆడనున్నట్లు వివరించారు. శిక్షణ ఇచ్చిన పీడీ సీజర్‌రెడ్డి, పీఈటీ మాధవరావును ఎంఈఓలు వెంకటనరసింహారావు, వీరాస్వామి అభినందించారు.

వైభవంగా కల్పవృక్ష వాహన సేవ



యోగ విద్యాగణపతిగా బాలగణపతి



కల్పవృక్ష వాహన సేవలో స్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని బాల గణపతి మందిరంలో స్వామి వారు శ్రీ యోగ విద్యా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజారి వారి వీధిలోని బాలగణపతి ఆలయంలో కొలువై ఉన్న స్వామి వారి 38వ వార్షికోత్సవ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం ఉదయం నుంచి స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా రోజుకొక రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉదయం స్వామి వారి సన్నిధిలో సుప్రభాత సేవతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం సహస్రనామార్చన తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి సహస్ర మోదక (ఉండ్రాళ్ళు) పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అర్చకులు మాట్లాడుతూ స్వామి వారు విద్యలకు అధిపతి వంటి వారన్నారు. స్వామి వారి ఆశీస్సులుంటే విద్యాపరంగా అందరికీ మేలు జరుగుతుందన్నారు. సాయంత్రం స్వామి వారికి కల్పవృక్ష వాహన సేవను వైభవంగా నిర్వహించారు. రమణీయంగా అలంకరించిన స్వామి వారి వాహన సేవలో వివిధ భజన మండళ్లకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యోగ విద్యాగణపతి అలంకారంలో ఉన్న స్వామి వారి సన్నిధిలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలను ఇతర స్టేషనరీ సామగ్రిని నిర్వాహకులు పంపిణీ చేశారు. పుస్తకాలు, పరీక్షా ప్యాడ్, ఇతర వస్తువులను అందించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలివే

చాట్రాయి: పోలవరం, చీపురుగూడెం, కోటపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంజయ్ గురువారం విలేకరులకు తెలిపారు. వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

రేపు స్నేహోత్సవం

నూజివీడు: గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సాహితీవేత్త ఎమ్వీఎల్‌ల జ్ఞాపకార్థం ఈనెల 23న పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో సెప్టెంబరు స్నేహోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సమాఖ్య నిర్వాహకులు ఎన్టీపీ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేపథ్య గాయని ఎస్పీ శైలజకు సంగీత సత్కారం, ముళ్లపూడి శ్రీదేవికి సాహితీ సత్కారం చేస్తున్నామని పేర్కొన్నారు. అధిక ప్రసంగం, ఎమ్వీఎల్ కవితలు అనే పుస్తకాలను ఆవిష్కరిస్తారన్నారు.

ఈఓపీఆర్డీ శ్రీనివాసరావుకు సత్కారం



విస్సన్నపేట: స్థానిక పంచాయతీగా ఈఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఈఓపీఆర్డీ అయిన శ్రీనివాసరావును స్థానిక షాదీఖానాలో పంచాయతీ ఆధ్వర్యాన గురువారం ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో మన్నన పొందిన వ్యక్తి శ్రీనివాసరావు అని ఎంపీపీ పిల్లి మేర్సివనజాక్షి కొనియాడారు. నాలుగేళ్లుగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లీశ్వరి, కేడీసీసీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ముసునూరు: మండలంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణులైన, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న ఎస్సీ, ఓబీసీ అభ్యర్థులకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఎన్‌బీసీఎఫ్‌డీసీ, ఎన్ఎస్ఎఫ్‌డీసీ సంస్థల ఆధ్వర్యంలో ఎస్సీ, ఓబీసీ యువతను ఎంపిక చేసి, వారికి విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ సీపెట్ కేంద్రంలో మెషిన్ ఆపరేటర్-ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తారని చెప్పారు. శిక్షణ అనంతరం చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, అనంతపురం తదితర ప్రాంతాల్లోని ప్లాస్టిక్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ప్రోగ్రామ్ ఆర్గనైజర్ సాకిరి రామకృష్ణను 93985 35697 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చేపల వ్యాపారులకు అవగాహన సదస్సు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ జక్కంపూడి కాలనీలోని నివసించే చేపల వ్యాపారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. దళిత్ బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఈ సదస్సు నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఈడీ అయ్య నాగరాజు వ్యాపారులనుద్దేశించి మాట్లాడారు. సొసైటీలో రిజిస్ట్రేషన్ ఎలా చేయించుకోవాలి, దాంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఫిషరీస్ డిపార్టుమెంట్ ఏడీ సీఎస్ చక్రాణి మాట్లాడుతూ చేపల వ్యాపారం చేయడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. కాలనీలోని చేపల మార్కెట్‌లో షాపులు స్థానిక వ్యాపారులకే కేటాయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కుంభా నాగరాజు, కుంభా శ్రీనివాసరావు, డీబీఆర్‌సీ కోఆర్డినేటర్ కేఎస్. మల్లేశ్వరిలతో పాటు కాలనీకి చెందిన పలువురు చేపల వ్యాపారులు ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గురజాడ అప్పారావు



పెనుగొలనులో గురజాడకు నివాళి



లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్లో గురజాడకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మైలవరం: అంటరానితనం, కన్యాశుల్కం, బాల్య వివాహం వంటి దురాచారాలపై పోరాడిన అభ్యుదయ కవి గురజాడ అప్పారావు చిరస్మరణీయుడని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లక్ష్మీపురం(తిరువూరు): మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్లో గురువారం సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం జరిగింది. సామాజిక అసమానతల తొలగింపునకు, మూఢాచారాల నిర్మూలనకు గురజాడ విశేష కృషి చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ విద్యార్థులకు వివరించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెనుగొలను(గంపలగూడెం): అభ్యుదయ కవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ అంటరానితనం, కన్యాశుల్కం, బాల్య వివాహాలు వంటి దురాచారాలపై గురజాడ పోరాడారని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన విద్యార్థుల ఆటల పోటీలు



గంపలగూడెంలో త్రోబాల్ ఆడుతున్న విద్యార్థినులు

గంపలగూడెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తిరువూరు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. చివరి రోజు బాలబాలికలకు నిర్వహించిన అథ్లెటిక్స్‌లో తిరువూరు, విస్సన్నపేట, ఏ కొండూరు, గంపలగూడెం మండలాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, మూడు కిలోమీటర్ల నడక పోటీ పెట్టారు. ఇక్కడ మూడు రోజులుగా జరిగిన పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో నియోజకవర్గ స్థాయిలో బాలబాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో తిరువూరు నియోజకవర్గ స్థాయిలో పోటీ జరిగింది. వీటిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి జట్లకు ఎంపిక చేశారు. తిరువూరు నియోజకవర్గ కన్వీనర్ గుర్రం గోపాలరావు, మండల కన్వీనర్ అంజియ్య, కో-కన్వీనర్ రాంబాబు ఆధ్వర్యంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు చిరుధాన్యాలపై పోటీలు



గంపలగూడెంలో విద్యార్థులకు సెమినార్

గంపలగూడెం: నేషనల్ సైన్స్ సెమినార్‌లో భాగంగా విద్యార్థులకు గురువారం గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీ నిర్వహించారు. మండల పరిధిలోని 8, 9, 10 తరగతుల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మిల్లెట్స్-ఏ సూపర్ ఫుడ్, ఏడైట్ ఫ్యాడ్ అంశంపై పోటీ నిర్వహించారు. ప్రథమస్థానంలో గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కొంగల మాధురి, ద్వితీయ స్థానంలో నెమలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రావుల రమ తేజస్విని, తృతీయ స్థానంలో కేజీబీవీ విద్యార్థి శ్రీకాకుళపు మహేశ్వరి నిలిచారు. వీరు ఈ నెల 23న జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారని ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు తెలిపారు. మండల కో ఆర్డినేటర్ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు బి.కిరణ్ కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరు: జాతీయ సైన్స్ సెమినార్‌లో భాగంగా గురువారం తిరువూరు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. తొమ్మిది పాఠశాలల నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నాగార్జున స్కూల్ విద్యార్థిని డీటీఎల్ మహిమ మండల ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో శ్యాంసుందర్ తెలిపారు.

సైబర్ సెక్యూరిటీ రంగంలో విస్తృత అవకాశాలు



ఏఎస్ఎన్ చక్రవర్తి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని జేఎన్‌టీయు (కాకినాడ) కంప్యూటర్ సైన్సెస్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఏఎస్ఎన్ చక్రవర్తి అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సీఎస్‌సీ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ ఇట్స్ చాలెంజెస్ అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్త డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో సైబర్ వినియోగం అధికమైందన్నారు. మొబైల్, కంప్యూటర్ వినియోగం అనివార్యమైన పరిస్థితుల్లో సమాచార భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. వివిధ డిజిటల్ వస్తువుల పాస్‌వర్డ్‌ల విషయంలో అజాగ్రత్తగా ఉండటం, అందరికి అర్థమయ్యే రీతిలో వాటిని ఏర్పాటు చేసుకోవటం వలన సైబర్ నేరగాళ్లు వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నూతన కంప్యూటింగ్ టెక్నాలజీస్‌తో సైబర్ నేరగాళ్లు ఆయా కంపెనీల పాస్‌వర్డ్‌లను ఛేదించి సమాచారాన్ని తస్కరిస్తున్నారని పేర్కొన్నారు. దానివలన అన్ని విధాలా నష్టం కలుగుతుందన్నారు. ఇటువంటి అంశాలపై కంప్యూటర్ రంగ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే సైబర్ సెక్యూరిటీకి సంబంధించి నిపుణుల కొరత అధికంగా ఉందన్నారు. కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ రంగానికి సంబంధించిన అంశాల్లో పట్టు సాధిస్తే ఆ రంగంలో మంచి ఉపాధి పొందటానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు



మాట్లాడుతున్న బండారు నరసింహారావు, వేదికపై దేవిడ్‌రాజు, కొప్పుల ఆనంద్, నృత్య కళాకారులు

విజయవాడ కల్చరల్: నవరస నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు బండారు నరసింహారావు అన్నారు. విజయశ్రీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి, సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనలు, అక్కినేని పేరుతో పురస్కారాల ప్రదానం కార్యక్రమం నిర్వహించింది. నరసింహారావు మాట్లాడుతూ అక్కినేని యుగం తెలుగు సినిమా స్వర్ణయుగమని తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ అక్కినేని స్వయం కృషితో నటుడిగా జీవితం ప్రారంభించి విభిన్న పాత్రలు పోషించి నిర్మాతగా, స్టూడియో అధినేతగా అనేక చిత్రాలను నిర్మించినట్లు తెలిపారు. సినీ నటుడు కొప్పుల ఆనంద్ మాట్లాడుతూ అక్కినేని నటజీవితం తెరచిన పుస్తకంగా అభివర్ణించారు. మధురిమ బృందం సంప్రదాయ కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. పవన్‌కుమార్, స్వాతి, రెహానా, తదితరులు అక్కినేని నటించిన చిత్రాల్లోని గీతాలను మధురంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బి. నళిని, దుర్గ, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

కానుకల లెక్కింపు

రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు భక్తులు హుండీల ద్వారా కానుకల రూపంలో సమర్పించిన ఆదాయం రూ.6,98,373 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను గురువారం శ్రీ దాస ఆంజనేయస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.భవాని సమక్షంలో లెక్కించారు.